భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

18, అక్టోబర్ 2026, ఆదివారం | భారత్ సమాచార్

# కుర్తివాడలో బతుకమ్మ సంబురాలు



**భారత్ సమాచార్, మెదక్ జిల్లా:** పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేకమైన సంప్రదాయమని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి తెలిపారు. సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని ఆదివారం పాపన్నపేట మండలం కుర్తివాడలో నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ, పాటలు పాడుతూ సందడి చేశారు.



## పూల అందాల నడుమ బతుకమ్మ వేడుకలు

కుర్తివాడలో మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి వేడుకలకు సిద్ధమయ్యారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ గీతాలను ఆలపిస్తూ ఉత్సాహంగా ఆడిపాడారు. మహిళలతో కలిసి పద్మా దేవేందర్‌రెడ్డి కూడా వేడుకల్లో పాల్గొనడంతో అక్కడ పండుగ సందడి నెలకొంది.



## భావితరాలకు సంప్రదాయాలను అందించాలి



ఈ సందర్భంగా పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతిపై ఉన్న ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. తరతరాలుగా కొనసాగుతున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు వాటి విశిష్టతను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి

ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే పండుగల్లో బతుకమ్మకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు.

## దుర్గామాతకు ప్రత్యేక పూజలు



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత అమ్మవారిని పద్మా దేవేందర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఆమెను శాలువాతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు జగన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, కుర్తివాడ మాజీ సర్పంచులు స్రవంతి శ్రీనివాస్, కిష్టాగౌడ్, గ్రామ అధ్యక్షుడు వెంకటేశం, మాజీ ఏడుపాయల డైరెక్టర్ మోహన్‌రావు, మాజీ ఉపసర్పంచ్ పోతా గౌడ్, నాయకులు సోములు, సిద్ధిరామిరెడ్డి, బాల్‌రెడ్డి, వడ్ల బ్రహ్మం, కమ్మరి బ్రహ్మం, మంగలి బొందయ్య, వడ్ల మధు, విల్సన్, సాయి వర్ధన్ గౌడ్, కాదూరి రాజు, సామెల్, సతీష్‌రావు, మల్లేశం, దత్తు తదితరులు పాల్గొన్నారు.